

# పుస్తక పరిచయం




**For Copies:**
**Sri Nagastr**
Krishnapuram Village
T.Narsapuram Post
WG Dt: 534 467
**Cell :** 964 031 7108
srinagastram@gmail.com

**తెలుగు** సాహితీలోకంలో సూటిగా, ధాటిగా, వాడిగా, వేడిగా సాగే తనదైన శైలితో కవిత్వాన్ని వ్రాస్తున్న యువగళం కలం - 'శ్రీనాగాస్త్ర'. గత ఆరేళ్ళలో ఆయన వెలువరించిన స్వీయకవితా సంపుటుల్లో నాలుగవది ఈ 'గాయపడ్డ గుండె భాష'. 2010లో 'నా కేక', 2013లో 'నా పడగలు', 2014లో 'మేరా దిల్ కా తుకడా' ల తర్వాత గత నెలలోనే ఆయన ప్రచురించిన స్వీయకవితా సంపుటి ఈ 'గాయపడ్డ గుండె భాష'. లోపల కవితల్లోని తీవ్రత, సంపుటి పేరులోనే ప్రతిఫలిస్తోంది. ఎక్కడా నాన్పుడు, డొంకతిరుగుడు, శబ్దాలంకారాల పటాటోపాలు లేకుండా, చెప్పదలచుకున్న విషయాన్ని అత్యంత పదునుగా చెబుతూనే, కవితాత్మని కోల్పోకుండా కవితలని కొనసాగించడం 'శ్రీనాగాస్త్ర' ప్రత్యేకత. ఎంపికచేసుకున్న అంశాల్లో కొత్తదనం కంటే చెప్పే క్రమంలో కొత్తదనాన్ని ప్రతి పదంలో దట్టించడం కూడా ఈ కవితల ప్రత్యేకత. త్యాగాల ప్రతిరూపమైన అమ్మ, మమ్మీగా మారిన అమ్మ, జీవిత పాఠాలు నేర్పిన అమ్మనాన్నలు, అక్షరాలు, పుస్తకాలు, ప్రపంచీకరణ... విభిన్న అంశాలమీదుగా సాగిన కవితలన్నీ పాఠకులను ఆకట్టుకుంటాయి, అలరిస్తాయి, ఆలోచింపచేస్తాయి. 'పవిత్ర వారసత్వం' అన్న కవితలో 'కవచకుండలాలు / ఇంద్రుడడిగితే / అడిగినవే దానమిచ్చాడు/ దానకర్ణుడు- ఓ మామిడిపండు / తింటానికి అడిగితే / మామిడి తోటనే / గంపల్లో నింపి తీసుకొచ్చి ఇచ్చేవాడు మా నాన్న- ..ధాన్యపుకొట్టు ఖాళీ అవుతున్నా / ఆస్తులన్నీ జీర్ణమవుతున్నా / ఎండిన డొక్కలు ఇంటిగుమ్మంలో నిలబడితే / అంబలి చలివేంద్రమయ్యేది మా అమ్మ' అన్న వాక్యాలు మనసుని సూటిగా తాకుతాయి. మరోకవితలో అమ్మగురించి 'వాకిట్లో / చీకట్లని ఉడ్చేసి / ఉషోదయ జ్యోతిర్లతల / కల్లాపి చల్లుతుంది' అంటారు. 'బొటనవేలును / రాజకీయనాయకుడు / నరుక్కుపోయాడు / గుద్దుకోవడానికి దొంగఓట్లు ' అన్న వాక్యాల్లో వర్తమానపుఅవినీతి ప్రతిబింబిస్తుంటే - 'నొసటి రాతల / నడుమనిశిలో / మూడో నేత్రాన్ని / బిగిస్తున్నాను - మానవమృగాన్ని / దారికి తెచ్చి / ప్రకృతిఒడిలోకి / తోలుతున్నాను ' అన్న వాక్యాల్లో కవికిగల నిశ్చయధోరణి స్పష్టంగా కనిపిస్తుంది. ఇలా ప్రతికవితలోనూ ఒక ప్రత్యేకతను ఎత్తి చూపవచ్చు. మొత్తం 54 కవితలున్న, ఈ సంపుటిలోని కవితల్లో అధికశాతం ప్రముఖ పత్రికల్లో ప్రచురించబడినవే. కవికి గల నిబద్ధత, నిజాయితీ, పదునైన ఆలోచనామార్గం ప్రతి కవితలోనూ కనిపిస్తుంది. వీరి కలం నుంచి ఇలాంటి కవితలు మరిన్ని రావాలని మనసారా ఆశిద్దాం.

★★★




**ఎవరు,** ఎపుడు, ఎలా ఎన్ని కవితలు, కథలు, వ్యాసాలు, పాటలు వ్రాసినా ఇంకా ఎంతో మిగిలిపోయే అంశం 'అమ్మ'. 'అమ్మ'ని ఏదో ఒక సాహితీ ప్రక్రియలో ఒదిగేలా చేయడం అసాధ్యం. అమ్మ గురించి ఎవరు వ్రాసిందైనా, ఎప్పుడు చదివినా కలిగే అనుభూతి, ఆ తీయదనం వేరు. అది ఎవరికివారు అనుభవించి తీరాల్సిందే. ఐతే అలాంటి అమ్మని వృద్ధాప్యంలో ఎంతమంది ప్రేమగా ఆత్మీయంగా చూసుకుంటున్నారు - అనే కొన్ని గణాంకాలకి వెళ్తే చాలా చేదు విషయాలు బయటపడతాయి. ఈ పుస్తకం ఉపోద్ఘాతంలో సంకలనకర్త ఉదహరించిన కొన్ని పరిశీలనా ఫలితాలు " వృద్ధాప్యంలో 37శాతం మంది అనుచిత అవమానకర జీవితాన్ని, 20 శాతం మంది నిర్బంధ జీవితాన్ని, 13 శాతం మంది మానసిక వేధింపులు, మరో 13 శాతం మంది కనీసపు అవసరాలు నోచుకోకపోవడం, 9 శాతం మంది శారీరక వేధింపులు భరిస్తూ దుర్భరంగా జీవిస్తున్నారని తెలుస్తోంది". ఉమ్మడికుటుంబాలు విచ్ఛిన్నమైన వర్తమాన పరిస్థితుల్లో అమ్మ పరిస్థితి మరింత ప్రశ్నార్థకమైందనడంలో సందేహంలేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి పుస్తకాల అవసరం ఎంతైనా ఉంది. సంకలనకర్త మాటల్లోనే చెప్పాలంటే " నేటి సమాజంలో వస్తున్న మార్పులను గమనించిన ఎందరో కవులు, రచయితలు సమాజ మార్పుకై కవితలు, వ్యాసాలు వ్రాశారు. అలాంటి కవితలను, వ్యాసాలను సేకరించి ఈ సంకలనంలో చేర్చడం జరిగింది." ఇదొక విశేషమైన , విశిష్టమైన ప్రయోగం. సంకలనకర్త జవహర్ లాల్ గారి సంకల్పాన్ని, ,ప్రయత్నాన్ని, కృషినీ అభినందించి తీరాలి. వివిధ పత్రికల్లో వివిధ సందర్భాల్లో వచ్చిన 'అమ్మ' గురించిన కవితలు, పాటలు, వ్యాసాలని ఒక చోట అందమైన మాలగా గుదిగుచ్చడమే కాక, అద్భుతమైన రేఖా చిత్రాలతో ఈ పుస్తకాని అందంగా, అమోఘంగా తీర్చిదిద్దారు. దాదాపు పాతికమంది రచయిత / త్రుల రచనలు ఇందులో చోటుచేసుకున్నాయి. - ఆధునిక కవులతోబాటు 1919 నాటి ఆంధ్రపత్రికలోని మండవాడ పార్వతీశ్వర శాస్త్రిగారి పద్యాలనుంచి, జాషువా గారి పద్యాలు, ఆదిశంకరుల మాతృ పంచకం లాంటి అరుదైన రచనలు కూడా ఇందులో ఉన్నాయి. అమ్మ - గురించి వచ్చిన సినిమాగీతాలని కూడా ఈ సంకలనంలో గమనించవచ్చు. ఈ సంకలనంలో చేర్చబడిన కొంతమంది రచయితలు - ప్రొ.ఎస్.వి.సత్యనారాయణ, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. డా.కె.శివారెడ్డి, గోరేటి వెంకన్న, ఎండ్లూరి సుధాకర్, సుద్దాల అశోక్ తేజ, కల్పనా రెంటాల మొదలైన వారు. ఇంక.. ఒక్కో కవిత, గేయం విషయానికి వస్తే - ఒక్కోటీ ఒక్కో అమృతగుళిక. ప్రతిదీ హృదయానికి హత్తుకునే , హృదయాన్ని కదిలించే రచనే. ఈ 'అమ్మతనానికి అక్షరాభిషేకం' కేవలం ఎవరికివారు చదివి అనుభూతించడానికి మాత్రమే కాదు, ఇతరులకు బహూకరించదగినది కూడా. ***

**Jawaharlal Guttikonda**
House# 72 – Shoilpa Brindavan Colony
Kukatpally
Hyderabad - 500 072
Cell : 988 576 9395

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**